## క్లుప్తంగా

### ఘనంగా నృసింహ హోమం



నర్సంపేట : పట్టణంలోని ద్వారకపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అధ్యయన ఉత్సవ బ్రహ్మోత్సవ ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని చైర్మన్ గంధం నరేందర్‌గుప్త ఆధ్వర్యంలో అర్చకుడు వెంకటాచార్యులు బృందంతో సుప్రభాత సేవతోపాటు సుదర్శన నృసింహ హోమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9 హోమ గుండాలలో 27 మంది దంపతులు పాల్గొని మంగళహారతులతో పూజలు చేశారు. సుదర్శన చక్ర హోమంతో పూజ చేసి ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సాంబయ్య, నరేందర్‌రెడ్డి, భాస్కరచారి, సురేశ్‌రెడ్డి, పావని, వేణు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

### వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



చెన్నారావుపేట : బీఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన ఖమ్మం–వరంగల్–నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలిచిన ఏనుగు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎంపీపీ జక్క అశోక్, మాజీ జెడ్పీటీసీ బుర్రి తిరుపతి కోరారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో ముద్రించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాన్ని మండల కేంద్రంలో వారు సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 27న జరగనున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటర్లు రాకేశ్‌రెడ్డికి అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, బుర్ర సుదర్శన్‌గౌడ్, రమేశ్‌నాయక్, బద్దునాయక్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రేపు జాబ్‌మేళా

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ ధర్మారంలోని ఎస్‌ఎస్ డిగ్రీ కళాశాలలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో రేపు (22న) ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల దూర విద్యా కేంద్రం డైరెక్టర్ కొక్కొండ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ చదివిన విద్యార్థులు రెజ్యూమ్‌తో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన వ్యక్తులు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నెలకు రూ.17 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని వివరించారు.

### స్నేహితురాలికి రూ.50 వేల సాయం



గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన మేకల మణెమ్మకు 1999–2000 సంవత్సరంలో ఆమెతో కలిసి పదో తరగతి చదువుకున్న స్నేహితులు సోమవారం రూ.50 వేల సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె స్నేహితులు మాట్లాడారు. మణెమ్మ భర్త గతంలో మృతి చెందిన క్రమంలో ఆమె ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో సాయం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గుడిమెట్ల శ్వేత, అల్లె శ్రీలత, వీరగోని భవాని, ఆసం లింగమూర్తి, ఓడెల రాజేందర్, తాటికొండ నరేందర్, యంబాడి నర్సింహస్వామి, శివప్రసాద్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుడి..**



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన కంబాల రాంబాబు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అతడికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి సోమవారం రూ.10 వేల సాయం చేశారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన నగదును రాంబాబుకు నాయకులు అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, తోట కమలాకర్, కాయిత అశోక్ తదితరులు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన గుండ రమేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ మండల నాయకుడు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కొమ్ము శ్రీకాంత్ రూ.5 వేల సాయం అందించారు.

### చర్య తీసుకోవాలి

ఖిలా వరంగల్: ప్రహరీ నిర్మాణానికి తవ్విన కందకాన్ని పూడ్చి భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధితులు సామాల నిరంజన్, నూనె రవి కోరారు. ఖిలావరంగల్ శివారు దూపకుంట రోడ్డులో పట్టాదారు వద్ద కొనుగోలు చేసిన భూమి తనదంటూ ప్రహరీ కోసం తవ్విన పునాదిని పూడ్చి కబ్జాకు యత్నించిన వ్యక్తిపై సోమవారం మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

# ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

## పల్లెల్లో కుప్పలుగా రాశులు

- తడిస్తే మిల్లర్లతో తంటా
- వెంటాడుతున్న అకాల వర్షాలు
- పని భారం, లారీల కొరతతో ఇబ్బంది

ఖానాపురం : ధాన్యాన్ని విక్రయించడంలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కోతలు ముమ్మరంగా అయినా కొనుగోళ్లు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. పల్లెల్లో ధాన్యపు రాశులు ఎక్కడికక్కడ కుప్పలుగా కనిపిస్తున్నాయి. అసలే మందకొడి కొనుగోళ్లు.. దానికి తోడుగా అకాల వర్షాలు రైతులకు ఆశనిపాతంగా పరిణమించాయి. ఆరబెట్టిన ధాన్యాన్ని విక్రయిద్దామంటే కొనుగోళ్లలో ఆలస్యం.. ఆరబెట్టిన తర్వాత అకాల వర్షంతో కొంత తడిసినా మళ్లీ ఆరబెట్టడం.. ఇలా రైతులను అనేక ఇబ్బందులు వేధిస్తున్నాయి.

జిల్లాలో ధాన్యాగార కేంద్రంగా పాకాల ఆయకట్టు గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఆయకట్టు కింద గోదావరి జలాలతో ఖానాపురం, నర్సంపేట, చెన్నారావుపేట మండలాల పరిధిలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు అయ్యింది. వరి చివరి దశకు చేరుకోవడంతో కోతలు నడుస్తున్నాయి. సుమారు 60 శాతానికిపైగా కోతలు పూర్తి కాగా మరో 40 శాతం కోతలు చేపట్టాల్సి ఉంది. రైతులు ఇప్పటికే కోతలను ముమ్మరం చేశారు. కోతలు చేపట్టే రైతులపై అకాల వర్షాలు పెనుభారాన్ని మోపుతున్నాయి. కోతలు పూర్తి చేసే క్రమంలోనే వర్షాలు పడుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. యాసంగిలో దాదాపు టూ వీల్ మిషన్ల సహాయంతోనే కోతలు చేపట్టాల్సి ఉండగా అకాల వర్షాల కారణంగా వరి పంటల్లో నీరు నిలిచిపోతోంది. తద్వారా ఫోర్ వీల్ లేదా ట్రాక్ మిషన్లతో కోతలు చేపడుతున్నారు. దీంతో రైతులపై కోతల భారం మరింతా పెరుగుతోంది.

**పరిస్థితి ఇలా..**

మండలంలోని ధర్మరావుపేట కొనుగోలు కేంద్రంలో సుమారు 700 బస్తాలు కాంటా వేసి మిల్లుకు పంపడానికి సిద్ధంగా ఉన్నా లారీల కొరతతో ముందుకు సాగడం లేదు. వాటిని తరలించడానికి సొసైటీ సిబ్బంది మిల్లుల వద్దకు పరుగులు తీస్తూ లారీల కోసం నానా అగచాట్లు పడుతున్నారు. ఇప్పుడే లారీల కొరత ఇలా ఉంటే ధాన్యపు రాశులు కొనుగోలు కేంద్రాలకు మరింతగా చేరితే పరిస్థితి ఎలా ఉంటుందనేది రైతులను వేదనకు గురి చేస్తోంది.

**ఎక్కడి రాశులు అక్కడే**

మండలవ్యాప్తంగా పీఏసీఎస్ ఆధ్వర్యంలో 9, రైతు సంఘాల ఆధ్వర్యంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటి ద్వారా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఖానాపురం సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు సుమారు 70 వేల ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. మరో 2.50 లక్షల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంది. రైతు సంఘాల ఆధ్వర్యంలోనూ కొనుగోళ్లు జరుగుతున్నాయి. వీటి పరిధిలోనూ ధాన్యం రాశులు భారీగానే రోడ్ల వెంట, కొనుగోలు కేంద్రాల సెంటర్లలో ఉన్నాయి. మిల్లర్ల తిరకాసులతోపాటు సొసైటీ అధికారులకు పని భారంతో కొనుగోలులో మరింత జాప్యం జరుగుతోంది. రుణమాఫీకి సంబంధించిన పనులు అప్పగించడంతో వాటిపైనే దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

**తడిసిన ధాన్యం కొనుగోలు హుళక్కేనా?**

అకాల వర్షాల కారణంగా తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రకటిస్తున్న విషయం తెలిసిందే. కాగా మిల్లర్ల వద్ద మాత్రం అమలు కాని దుస్థితి నెలకొంది. తడిసిన ధాన్యాన్ని మిల్లర్ల వద్దకు తీసుకెళితే కోత లేదా నిరాకరణ తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయినా ప్రభుత్వం, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఆయకట్టు పరిధిలో పేరుకుపోయిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు, మండల ప్రజలు కోరుతున్నారు.

**లారీల కొరత...**

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన తొలిరోజుల్లో లారీలు బాగానే వచ్చినా సోమవారం నుంచి లారీల కొరత సైతం ఏర్పడిందని అధికారులు, రైతుల ద్వారా తెలుస్తోంది. తేమ శాతం కొంత అటుఇటుగా వచ్చినా కొనుగోళ్లు ముమ్మరం చేయడంతోపాటు లారీల కొరత సైతం ఏర్పడకుండా అధికారులు చర్యలు చేపడితే రైతులకు సమస్యలు తొలగిపోనున్నాయి. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మిల్లర్లకు, పీఏసీఎస్ అధికారులకు ఆదేశాలు రాకపోవడంతో వారు సైతం తలలు పట్టుకుంటున్నారు. మిల్లర్ల వద్ద అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయించి తడిసిన ధాన్యాన్ని దించుకునేలా చర్యలు చేపట్టాల్సి ఉంది. మండలంలో లారీల కొరత సైతం లేకుండా లారీలను ఎక్కువగా పంపాల్సిన అవసరం ఉంది.



ఖానాపురంలో ఆరబెట్టిన ధాన్యం

**తేమ శాతంతో ఆలస్యం**

మండలవ్యాప్తంగా కొనుగోళ్లు చేపడుతున్నాం. అకాల వర్షాల కారణంగా తేమ శాతం రావడం లేదు. తద్వారా కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలనే ఆదేశాలు ఇప్పటివరకు అందలేదు. రెండు లారీల్లో తడిసిన ధాన్యం వస్తే అధికారులకు తెలిపి దిగుమతి చేయించాం. సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేస్తున్నాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం

–ఆంజనేయులు, సీఈఓ, ఖానాపురం

## రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



నర్సంపేట : ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట : నల్గొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ బలపర్చిన ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, ఎన్నికల ఇన్‌చార్జ్ గోనె యువరాజు కోరారు. పట్టణంలోని 9, 10, 19వ వార్డులో పట్టణ యూత్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం చేపట్టిన ఇంటింటి ప్రచారంలో వెంకటనారాయణ, యువరాజు మాట్లాడారు. కార్యక్రమంలో క్లస్టర్ బాధ్యుడు బండి రమేశ్, కౌన్సిలర్ పద్మప్రసాద్, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండలంలోని గోవిందాపురం, మూడుచెక్కపల్లి, రాంపూర్, మేడపల్లి, ఆసరవెల్లి, గొల్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడారు. కార్యక్రమంలో నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట, తదితర గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఎన్నికల కోకన్వీనర్ రాధారపు అశోక్, వేల్పుల లింగయ్య, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండలంలోని దీక్షకుంట, ముదిగొండ గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో ఎంపీపీ రమేశ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ మారం రాము మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ము రమేశ్ యాదవ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతోనే సైబర్ నేరాలకు చెక్



వర్ధన్నపేట : అవగాహన కలిగి ఉండడం ద్వారానే సైబర్ నేరాలకు చెక్ పెట్టగలమని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఇల్లందలో ప్రజలకు సోమవారం ఆయన అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్ల మోసానికి గురై డబ్బులు పోగొట్టుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహించే వ్యక్తులు అపరిచితుల మాటలు నమ్మవద్దని చెప్పారు. తెలియని లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలిపారు. బహుమతులు వచ్చాయని, లాటరీ తగిలిందని, తదితర మోసపూరిత మాటలతో సైబర్ నేరగాళ్లు వల విసిరే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నానునాయక్ సేవలు మరువలేనివి



రాయపర్తి : ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు గుగులోతు నానునాయక్ పేదలకు అందించిన సేవలు మరువలేనివని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గోనె కుమారస్వామి తెలిపారు. మండలంలోని నానునాయక్ స్వగ్రామమైన జయరాంతండా(ఎస్)లోని స్మారక స్తూపం వద్ద పార్టీ మండల కార్యదర్శి గుగులోతు అరుణ్‌నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన 3వ వర్ధంతిలో ఘనంగా నివాళలర్పించారు. అనంతరం కుమారస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ డివిజన్ కార్యదర్శి మంద రవి, జిల్లా కమిటీ సభ్యుడు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అష్టోత్తర శతకలశాభిషేకం



ఐనవోలు : ప్రత్యేకాలంకరణలో ఉత్సవ మూర్తులు



ఆత్మకూరు : శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో అష్టోత్తర శత కలశాభిషేకం యాజ్ఞికులు రవి ఆచార్యుడు నేతృత్వంగా నిర్వహించారు. ఆలయంలో ఈనెల 18 నుంచి 23 వరకు షష్టమ(6వ) వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో నిత్యపూజలు పూర్తయిన తర్వాత బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు యాగశాలలో నిత్యహవనం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అష్టోత్తరశత (108) కలశాలను సుగంధ, పరిమళ ద్రవ్యాలు, ఓషధులు, నవధాన్యాలు, పంచామృతాలు, పండ్ల రసాలు, పంచ పల్లవాలు, నీటితో నింపారు. ప్రత్యేక పూజలు వేదమంత్రాలతో కలశస్థాపన చేసి నారాసింహుడి ధ్రువమూర్తికి, ఆలయంలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ, లక్ష్మణ, హనుమాన్ సహిత సీతారామచంద్రమూర్తి, గోదాకృష్ణ, పద్మావతి అలివేళిమంగ సహిత వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను అభిషేకించారు. సాయంత్రం విష్ణుసహస్ర నామ పుష్పార్చన, సేవాకాలం తీర్థ ప్రసాదగోష్టి జరిపించారు. ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, తాడెం మోహన్, అర్చకుడు జయ కృష్ణమాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. అర్చకుడు ఆరుట్ల మాధవ మూర్తి ఆధ్వర్యంలో వేదపండితులు గరుడ హోమం నిర్వహించి ధ్వజారోహణం చేశారు. సంతానప్రాప్తి, వివాహప్రాప్తి తదితర కోర్కెల ఫలితం కొరకు గరుడముద్దల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. అలాగే మంగళవారం రాత్రి 8గంటలకు ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరుగనుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### చికిత్స పొందుతున్న కారోబార్ మృతి

కొత్తగూడ: ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని పొగుళ్లపల్లిలో జరిగింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గత నెల రోజుల క్రితం దొంగతనం చేశాడనే నెపంతో పొగుళ్లపల్లి వ్యాపారస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో దళిత యువకున్ని చితకబాదిన విషయం తెలిసిందే. గ్రామ పంచాయతీ కార్యాలయం తాళం తీసినందుకు గాను కారోబార్‌గా పని చేస్తున్న గుగ్గిల్ల నర్సయ్య(40)పై కేసు కావడంతో పాటు కారోబార్ ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ నోటీసులు జారీ అయ్యాయి. దీంతో నాలుగు రోజుల క్రితం తన ఉద్యోగం పోవడమే కాకుండా కేసుల పాలు అయ్యానని అందుకు కారణం అయిన వ్యాపారులను పంచాయతీ పెద్దల వద్దకు పిలిపించి పరిహారం ఇవ్వాలని నర్సయ్య కోరాడు. కేసు పూర్తి అయ్యే వరకు పరిహారం ఇప్పించలేమని పెద్దలు తీర్పు ఇస్తారు. దీంతో మనస్తానికి గురైన నర్సయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించి గ్రామస్తులు నర్సయ్యను ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

### రేపు నృసింహుడి జయంతి

దామెర : ఈనెల 22న మండలంలోని ఊరుగొండ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నృసింహస్వామి జయంతి నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు తూపురాణి శ్రీనివాసచార్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించనున్నారు. 11 గంటలకు స్వామివారి కల్యామహోత్సవం, అనంతరం అన్నదానం ఉంటుందని తెలిపారు.

## పరిహారం అందించాలని వినతి



నల్లబెల్లి : ఇటీవల కురిసిన భారీ వడగళ్ల వర్షాలకు ఇండ్లు కూలిపోయిన బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని దళిత సంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ రాజేశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం సాంబయ్య, నరేశ్ మాట్లాడారు. భారీ వడగళ్ల వానకు మండలంలోని గుండ్లపహాడ్, నారక్కపేట, మేడపల్లి, రాంపూర్, ఆసరవెల్లి, గొల్లపల్లి, నల్లబెల్లి గ్రామాల్లో పలువురి ఇండ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు సత్వరమే స్పందించి ఇండ్లు దెబ్బతిని నష్టపోయిన కుటుంబాలకు తక్షణ సాయం అందించడంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

## నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ చంద్రమోహన్

నెక్కొండ : నాసిరకం విత్తనాలు విక్రయిస్తే సంబంధిత ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ షాపుల యజమానులపై చట్టరీత్యా చర్యలు తప్పవని సీఐ చంద్రమోహన్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ దుకాణాల యజమానులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాల్లో నిషేధిత, నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, పురుగు మందులు విక్రయించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. నకిలీ, నిషేధిత విత్తనాల విక్రయాన్ని అరికట్టేందుకు వ్యవసాయ, పోలీసు, ఇతర శాఖలు ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు. ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ షాపులను తనిఖీలు చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసే వారిపైనా కేసు నమోదు చేస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ ఏఓ ఎగిడి నాగరాజు మాట్లాడుతూ డీలర్లు విత్తన అమ్మకం, నిల్వల వివరాలను ఆన్‌లైన్‌లో విధిగా నమోదు చేసి ఫారం–డీ అందించాలని చెప్పారు. గడువు ముగిసిన విత్తనాలను షాపుల్లో నిల్వ ఉంచొద్దని, అమ్మకాలు చేపట్టవద్దని తెలిపారు. విత్తన స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్ విధిగా అప్‌డేట్ చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని డీలర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏఈఓలు, షాపుల యజమానుల, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతోనే పాఠశాలల్లో అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : కమిటీలోని సభ్యులందరూ సమన్వయంతో పని చేస్తే అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అవుతాయని ఎంపీడీఓ నర్సింహమూర్తి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లు, కన్వీనర్లతో గ్రామాల వారీగా ఆయన సోమవారం సమీక్షించారు. పాఠశాలలో కొనసాగుతున్న పనుల వివరాలు కోసం సమావేశాల పేరుతో మాటిమాటికి మమ్ములను ఎందుకు పిలుస్తున్నారంటూ కన్వీనర్లుగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎంలు రాంరెడ్డి, నటరాజ్, శ్రీనివాస్, కృష్ణమూర్తి, గోవర్ధన్ తదితరులు మండల విద్యా నోడల్ అధికారి శ్రీనివాసరావును నిలదీశారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిడ్డారు. దీంతో ఎంపీడీఓ నర్సింహమూర్తి జోక్యం చేసుకుని హెచ్‌ఎంలకు సర్దిచెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లోని ప్రతీఒక్కరు సమన్వయంతో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చి వారిని శాంతింపజేశారు. అనంతరం సమీక్ష సమావేశాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో మదర్ తెరిస్సా మండల సమాఖ్య అధ్యక్షురాలు ఊటుకూరి బాగ్యలక్ష్మి, ఏపీఎం సునీత, ఏఈ సదయ్య తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పట్టభద్రులకు న్యాయం



ఖానాపురం : కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

ఖానాపురం : కాంగ్రెస్ పాలనలోనే పట్టభద్రులకు న్యాయం జరుగుతుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు తెలిపారు. మండల కేంద్రంలో వరంగల్–ఖమ్మం–నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాలను వారు సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటే పార్టీ బలపర్చిన తీర్మాన్ మల్లన్నను ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సూచించారు. సమావేశంలో నర్సంపేట ఇన్‌చార్జ్ పబ్బతి సతీశ్‌రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాస్, నాయకులు రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కరపత్రాన్ని కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్ గాడిపెల్లి యాకన్న, పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నెక్కొండ రామలింగేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు బండి శివకుమార్, సింగం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కరపత్రాన్ని కాంగ్రెస్ ఎన్నికల కోఆర్డినేటర్ యాకయ్య, పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొగిళి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, నాయకులు మంద యాకయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, సమ్మయ్య, వల్లపు కుమార్, చిర్ర మల్లయ్య, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## రైతులను దోచుకునేందుకు మిల్లర్ల కుట్ర



సమావేశంలో మాట్లాడుతున్న రాజమౌళి

నర్సంపేట : తడిసిన ధాన్యం పేరుతో మద్దతు ధర చెల్లించకుండా రైతులను దోచుకునేందుకు మిల్లర్లు కుట్ర పన్నుతున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకుడు కొత్తకొండ రాజమౌళి తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో భారీగా ధాన్యం తడిసిందని చెప్పారు. ఇదే ఆదునుగా మిల్లర్లు ధాన్యం తడిసిన క్రమంలో కొనుగోలు చేయబోమంటూ సతాయిస్తూనే తక్కువ ధర చెల్లించేందుకు యత్నిస్తున్నారని చెప్పారు. ధాన్యంలో కోత విధించకుండానే మద్దతు ధర చెల్లించి ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ధాన్యం తడిసి నష్టపోయిన రైతులను ఆదుకోవడంతోపాటు తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరకే కొనుగోలు చేయాలని, మిగతా పంట ఉత్పత్తులను కాపాడేందుకు అన్ని వ్యవసాయ మార్కెట్లలో కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేశ్, నాయకులు మహ్మద్ అలీసాబ్, అజిత్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్యవైశ్య మిత్ర బృందం సన్మానం

వరంగల్ చౌరస్తా: పదవ తరగతి, ఇంటర్ మీడియట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆర్యవైశ్య విద్యార్థులను సోమవారం సన్మానించారు. వరంగల్ మేదరవాడలోని ఆర్యవైశ్య మిత్ర బృందం కార్యాలయంలో కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు దుబ్బా శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 9.5 – 10 జీపీఏ సాధించిన పదో తరగతి విద్యార్థిని విద్యార్థులు, ఇంటర్ సెకండియర్‌లో 95% మార్కులు సాధించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మిత్రబంధం కోశాధికారి దొడ్డ మోహన్‌రావు, నాయకులు పల్లా పరమేశ్వర్, పాల మురళీధర్, సదాశివుడు, చిన్నాల సురేశ్ పాల్గొన్నారు.